సాక్షి
విజయనగరం
శనివారం । 1 । జూన్ । 2024



బిట్‌కాయిన్ కోసం జంట హత్యలు

ఏజెన్సీలో బిట్‌కాయిన్ మోసాలు హత్యల వరకు దారితీశాయి. ఇంతవరకు నగదు వరకే సాగిన ఈ వ్యాపారం ఇద్దరి హత్యలతో సంచలనంగా మారింది. -10లో



బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకుల మృతి -10లో

మితిమీరిన వేగంతో నడిపిన బైక్‌ను అదుపుచేయలేక ఇద్దరు ప్రాణాలు విడిచారు.



అసంపూర్ణంగా ముగిసిన జిందాల్ కార్మికుల చర్చలు

జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగారం కార్మికులు, యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు సఫలం కాలేదు. -10లో

న్యూస్‌రీల్

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



స్వామివారి సన్నిధిలో సహస్ర దీపారాధన జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

- జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్



దివ్యాంగ విద్యార్థుల సర్వేలో పాల్గొన్న డీఈఓ ప్రేమకుమార్, సిబ్బంది

విజయనగరం అర్బన్: బడిఈడు వయసు ఉన్న దివ్యాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ కోరారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బడిఈడు బయట గల దివ్యాంగ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు మే 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు చేపడుతున్న ప్రవేశాల డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పలువురు తల్లిదండ్రులను కలిసి దివ్యాంగ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక బోధన అందిస్తున్నట్టు వివరించారు. శారీరక వైకల్యాలు నయమయ్యేలా ఫిజియోథెరపీ చేయిస్తున్నామన్నారు. డ్రైవ్‌లో జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, సహాయ కో ఆర్డినేటర్ ఎం.భారతి, సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైడితల్లి వనంగుడి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి వనంగుడి హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. 65 రోజులకు రూ.5,84,73,000ల నగదు, 110 గ్రాముల వెండి, 108 కాసుల వెండి హారం, వెండి కిరీటం వచ్చిందని ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. హారం, కిరీటాన్ని వనంగుడి అమ్మవారికి అర్చకులు అలంకరించారు. కార్యక్రమంలో అమ్మవారి సేవా సమితి, శ్రీవారి సేవా సంస్థ సభ్యులు, అర్చకులు, సిబ్బంది, కెనరా బ్యాంకు అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వనంగుడిలో పైడితల్లికి అలంకరించిన వెండి కిరీటం, హారం

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- రెండు ప్రదేశాల్లో ఓట్ల లెక్కింపు
- జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంది
- కౌంటింగ్‌కు అంతా సహకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఓట్ల లెక్కింపునకు జిల్లాలో దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టంచేశారు. జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో విజయనగరం పార్లమెంట్, బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాలు, లెండి ఇంజినీరింగ్ కళాశాలలో చీపురుపల్లి, రాజాం, గజపతినగరం, ఎస్.కోట, నెల్లిమర్ల నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. జూన్ 6వ తేదీ వరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, అప్పటి వరకు ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం షాపులను మూసివేయిస్తామని తెలిపారు. ఎన్నికల ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేదంటే ఆర్‌ఓల ద్వారా వారిపై చర్య తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, కౌంటింగ్ ప్రక్రియ కూడా సజావుగా, శాంతియుతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు చేసిన ఏర్పాట్లను శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నాగలక్ష్మి వివరించారు. ఆమె మాటల్లోనే...

● ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం

జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఆ రోజు కౌంటింగ్ సిబ్బంది అంతా ఉదయం 6 గంటలకు, ఏజెంట్లు ఉదయం 7 గంటలకు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలి. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుంది. అరగంట తర్వాత ఈవీఎంల లెక్కింపు ప్రారంభం అవుతుంది. అన్ని చోట్లా అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశాం. విజయనగరం పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో (ఎచ్చెర్లతో సహా) పార్లమెంటుకు పోలైన పోస్టల్ బ్యాలెట్లన్నీ లెండి ఇంజినీరింగ్ కళాశాలలోనే లెక్కిస్తారు. విశాఖ పార్లమెంట్‌కు పోలైన పోస్టల్ బ్యాలెట్లను సైతం లెండి ఇంజనీరింగ్ కళాశాలలోనే లెక్కించడం జరుగుతుంది. విశాఖ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్న ఎస్.కోట నియోజకవర్గంలో ఎంపీకి పోలైన పోస్టల్ బ్యాలెట్ మాత్రం విశాఖపట్నంలో లెక్కిస్తారు. అసెంబ్లీకి పోలైన పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్లను మాత్రం జిల్లాలోని ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లోనే లెక్కిస్తారు.



మీడియాకు కౌంటింగ్ ఏర్పాట్లు వివరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

● కౌంటింగ్ కేంద్రాలు:

- లెండి ఇంజినీరింగ్ కళాశాలలో గజపతినగరం, రాజాం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మెకానికల్ బ్లాక్‌లోను, విజయనగరం పార్లమెంట్ పోస్టల్ ఓట్లతో పాటు నెల్లిమర్ల, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మెయిన్ బ్లాక్‌లో జరుగుతుంది.
- జేఎన్‌టీయూ జీవీలో బొబ్బిలి పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ ఓట్లు అకడమిక్ బ్లాక్-1 రెండో అంతస్తులోను, విజయనగరం పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించి అకడమిక్ బ్లాక్-2లోని కింది అంతస్తులో కౌంటింగ్ జరుగుతుంది.

కౌంటింగ్ ప్రక్రియ సాగనుందిలా..

నియోజకవర్గం	బూత్‌లు	ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాజాం(ఎస్సీ)	284	1,72,906	14	21
బొబ్బిలి	254	1,85,775	14	19
చీపురుపల్లి	257	1,71,533	14	19
గజపతినగరం	264	1,77,612	14	19
నెల్లిమర్ల	248	1,88,456	14	18
విజయనగరం	260	1,84,787	14	19
ఎస్.కోట	270	1,90,104	14	20
మొత్తం	1,847	12,71,173	98	135



జేఎన్‌టీయూ జీవీలో ఓట్ల లెక్కింపునకు సిద్ధం చేసిన టేబుళ్లు

అసెంబ్లీకి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కూడా అదే బ్లాక్‌లలో నిర్వహిస్తారు.

● ఎలక్ట్రికల్ పరికరాల అనుమతి లేదు

ఒక్కో నియోజకవర్గానికి కలిపి పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు నిమిత్తం మొత్తం 4 లెక్కింపు టేబుళ్లను, ఈవీఎంల ఓట్ల కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశాం. అసెంబ్లీ పోస్టల్ బాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో కేంద్రంలో నాలుగు టేబుళ్లను సిద్ధం చేశాం. అలాగే, అన్ని నియోజకవర్గాల పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం లెండి కళాశాల లెక్కింపు కేంద్రంలో 20 టేబుళ్లను ఏర్పాటు చేశాం. ఈవీఎంల ఓట్ల లెక్కింపులో వరుసకు ఏడు చొప్పున మొత్తం 14 టేబుళ్లు అమర్చాం. ఏయే బ్లాక్‌లలో ఏయే నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందో అందరికీ అర్థమయ్యేలా సైన్ బోర్డులను తెలుగులో కూడా స్పష్టంగా ఏర్పాటు చేశాం.

● రౌండ్ల వారీగా లెక్కింపు:

పార్లమెంట్, అసెంబ్లీ కౌంటింగ్‌కు ఒక్కో కేంద్రంలో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశాం. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా రాజాంకు అత్యధికంగా 21 రౌండ్లు, నెల్లిమర్లకు అత్యల్పంగా 18 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. ఎస్.కోట-20, బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, విజయనగరం నియోజకవర్గాల లెక్కింపు 19 రౌండ్లలో పూర్తికానుంది. అన్ని టేబుళ్ల వద్ద లెక్కింపు పూర్తయి, ఆ రౌండ్ ఫలితాలను ప్రకటించిన తరువాతే తదుపరి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది.

● కౌంటింగ్ సిబ్బంది నియామకం

ర్యాండమైజేషన్ ద్వారా మొత్తం 970 మందిని కౌంటింగ్ కోసం కేటాయించగా వీరిలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 289 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 340 మంది, మైక్రో అబ్జర్వర్లు 343 మంది ఉన్నారు. ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్ (గెజిటెడ్), ఒక కౌంటింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్ (గెజిటెడ్), ఇద్దరు కౌంటింగ్ అధికారులు (గెజిటెడ్), ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. ఈటీపీబీఎస్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక ఏఆర్‌ఓ ఉంటారు. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లుగా నియామక పత్రం ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తాం. ఒక అధికారిక వీడియోగ్రాఫర్ ద్వారా మొత్తం కౌంటింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయిస్తాం. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేశాం. ఓటర్లు ఎవరికి ఓటు వేశారన్న రహస్యానికి భంగం వాటిళ్లకుండా లెక్కింపు ప్రక్రియ పూర్తిచేస్తాం. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లిరావడానికి సిబ్బందికి ఏజెంట్లకు వేర్వేరుగా మార్గాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ స్పష్టంచేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో కౌంటింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరిగే జేఎన్‌టీయూ జీవీలో ముందుగా కౌంటింగ్ ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం లెండి ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. ఇక్కడ చీపురుపల్లి, రాజాం, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఇక్కడ మీడియా సెంటర్, హెల్ప్ డెస్క్, సెల్ ఫోన్ సెంటర్, కమ్యూనికేషన్ రూమ్, భోజనశాల ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా సెల్ ఫోన్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం సిద్ధం చేసిన వివిధ కౌంటర్లు, స్టాల్స్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, కౌంటింగ్ సెంటర్లు, మరుగుదొడ్లు, సెల్ ఫోన్ కౌంటర్, కమ్యూనికేషన్ రూం, పార్కింగ్ తదితర సౌకర్యాలను సూచిస్తూ విరివిగా బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కౌంటింగ్ రోజు సుమారు 3 వేల మందికి సరిపడా అల్పాహారం, భోజనాన్ని సిద్ధం చేయాలన్నారు. టిఫిన్ ఉదయం 6 గంటలకు ప్రారంభించి, 7 గంటలకు పూర్తి చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ స్టాఫ్, మీడియా, పోలీస్, ఏజెంట్లకు వేర్వేరుగా భోజన కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏజెంట్లు డబ్బులు చెల్లించి భోజనం పొందే విధంగా వారి సంఖ్యను బట్టి భోజనాన్ని సిద్ధం చేయాలన్నారు. అందరికీ సరిపడేలా అవసరమైనన్ని మరుగుదొడ్లను ఏర్పాటు చేసి, వాటిని గుర్తించే విధంగా బోర్డులు, సూచికలు పెట్టాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పర్యటనలో జేసీ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, లెక్కింపు కేంద్రాల ఇన్‌చార్జిలు, జిల్లా అధికారులు, ఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. నలుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

భోగాపురం:

మండలంలోని పోలిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో రెండు బైకులు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఒడిశా రాష్ట్రం జైపూర్ గ్రామానికి చెందిన జావెద్ అక్తర్ ఇక్కడి సన్‌రే రిసార్ట్స్‌లో వంట కుక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన సొంత పనుల నిమిత్తం శుక్రవారం సాయంత్రం బైక్‌పై తగరపువలస వెళ్లి వస్తుండగా అదే సమయంలో సవరవిల్లి గ్రామానికి చెందిన బోర రమేష్, జగన్, గారి గణేష్ అనే ముగ్గురు యువకులు సినిమా చూసేందుకు బైక్‌పై సవరవిల్లి నుంచి తగరపువలస బయలు దేరారు. పోలిపల్లి గ్రామానికి చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న జావెద్ అక్తర్‌ను బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో బైకులు నడుపుతున్న బోర రమేష్, జావెద్ అక్తర్ తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, సన్‌రే రిసార్ట్స్ యాజమాన్యం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రులకు జావెద్ అక్తర్, బోర రమేష్, జగన్, గణేష్‌లను తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ ఎ.రవికుమార్ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

● మేఘావృతం



పగలంతా ఎండతీవ్రత, ఉక్కబోతతో అల్లాడిన జనం శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. వీరఘట్టం పట్టణాన్ని చుట్టేసిన మేఘాలు.. కాసేపటికి నీటిమూటను ఇప్పి కనుమరుగయ్యాయి. ఈ సుందర దృశ్యాలను స్థానిక యువత సెల్‌ఫోన్‌లలో బంధించి మురిసిపోయారు.

– వీరఘట్టం


పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాల పంపిణీ

లక్కవరపుకోట:

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తామని డీఈఓ ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. ఎల్.కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌లో పంపిణీకి సిద్ధంగా ఉంచిన విద్యా కానుకలను సరిచూశారు. అనంతరం ఎమ్మార్సీ భవనంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచి 63 పాఠశాలల్లో సీబీఎస్ సిలబస్ బోధిస్తామని చెప్పారు. తెట్టంగి, జామి, కోనూరు, బొండపల్లి, రామభద్రపురం, పిరిడి, ఎ.వి..పురం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలలుగా మార్చామన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. భవిత కేంద్రాల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 476 మంది విభిన్న ప్రతిభావంతులను గుర్తించామన్నారు. వీరందరికి భవిత కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తామన్నారు. 10వ తరగతి మార్కుల జాబితాల్లో తప్పులు దొర్లితే హెచ్‌ఎంల ద్వారా దరఖాస్తు చేసుకుంటే వెంటనే సరిచేస్తామన్నారు. ఆయన వెంట ఎంఈఓలు సీహెచ్ కూర్మారావు, జి.శ్రీనివాసరావు ఉన్నారు.



ఏపీ మోడల్ స్కూల్‌లో సిద్ధం చేసిన పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమకుమార్



కొమరాడ:

కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామ సమీపంలో జంఝావతి రబ్బర్ డ్యామ్ సందర్శకులను ఆకర్షిస్తోంది. ఆస్ట్రియా టెక్నాలజీతో నిర్మించిన రబ్బర్ డ్యామ్‌ను 2006 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి జాతికి అంకితం చేశారు. సమారు 8 వేల ఎకరాలకు ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుతోంది. ఈ జలాశయం ప్రస్తుతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడి పరిసరాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. వేసవికాలంలో డ్యామ్‌లో ఈతకొట్టేందుకు అధికమంది ఆసక్తి చూపుతున్నారు.

మార్గం ఇలా...

పార్వతీపురం నుంచి ఆర్టీసీ బస్సులో కొమరాడ, కూనేరు, రాయగడ మీదుగా జంఝావతి సెంటర్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి 3 కిలోమీటర్ల దూరం ఆటోలో ప్రయాణించి డ్యామ్ వద్దకు చేరుకోవచ్చు.

వేటు తప్పదిక!

- రఘురాజు ఎమ్మెల్సీ సభ్యత్వ రద్దుపై తీర్పు వాయిదా
- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలపై శాసనమండలి విప్ విక్రాంత్ ఫిర్యాదు
- విచారణకు హాజరుకావాలని ఛైర్మన్ రెండుసార్లు పిలుపు
- వివరణ ఇచ్చుకునే అవకాశాన్ని చేజేతులా చేజార్చుకున్న వైనం
- ఆరోగ్య కారణాలు చూపిస్తూ విచారణకు మరోసారి డుమ్మా



సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు సాక్ష్యాలు బట్టబయలైన నేపథ్యంలో ఇందుకూరి రఘురాజు ఎమ్మెల్సీ సభ్యత్వంపై వేటు తప్పేలే లేదు. శాసనమండలి ఛైర్మన్ సమక్షంలో శుక్రవారం విచారణకు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉన్నా రఘురాజు డుమ్మా కొట్టారు. తనపై వచ్చిన ఫిర్యాదుపై వివరణ ఇచ్చేందుకు రెండుసార్లు అవకాశం వచ్చినా ఆయన చేజేతులా చేజార్చుకున్నారు. మూడు నెలల కిందటే ఆయన భార్య, ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాజు లోకేశ్ సమక్షంలో టీడీపీ కండువా వేయించుకున్నారు. దీంతో ఆమె బాహాటంగానే టీడీపీ ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలితకుమారితో కలిసి సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం చేశారు. రఘురాజు దంపతుల నివాసంలోనే టీడీపీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. మరోవైపు కోళ్ల లలితకుమారికి, ఎస్.కోట టికెట్ కోసం విఫలయత్నం చేసిన గొంప కృష్ణకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైదరాబాద్‌లో లోకేశ్ సమక్షంలో జరిగిన పంచాయతీకి స్థానిక టీడీపీ మండల నాయకులతో కలిసి రఘురాజు హాజరైన వైనాన్ని ఫొటోలతో సహా 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఇలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని శాసనమండలిలో విప్ పాలవలస విక్రాంత్ ఫిర్యాదు చేశారు. దీనిపై ఛైర్మన్ మోషేన్ రాజు విచారణ చేపట్టారు. మే 27వ తేదీన విచారణకు హాజరుకావాలని రఘురాజుకు నోటీసులు జారీచేశారు. కారణాలేమీ చెప్పకుండానే రఘురాజు డుమ్మాకొట్టారు. దీంతో ఛైర్మన్ మరోసారి నోటీసులు జారీ చేశారు. 31వ తేదీన విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని, వివరణ ఇచ్చుకోవడానికి ఇదే తుది అవకాశమని స్పష్టం చేశారు.

ఆరోగ్య సమస్యలట...

రఘురాజు గురువారం వరకూ ఎంతో ఉత్సాహంగా నియోజకవర్గంలో గడిపినా శుక్రవారం మాత్రం ఆరోగ్య సమస్యల పేరుతో విచారణకు డుమ్మా కొట్టేశారు. విజయవాడలోని శాసనమండలి ఛైర్మన్ ఛాంబర్‌లో జరిగిన విచారణకు ఫిర్యాదుదారుడైన పాలవలస విక్రాంత్ హాజరయ్యారు. మే 27వ తేదీన విచారణకు కూడా వెళ్లారు. ఈ రెండుసార్లు రఘురాజు హాజరుకాలేదు. శుక్రవారం ఆయన విశాఖ హెల్త్‌సిటీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరినట్లు తెలిసింది.

త్వరలోనే తీర్పు...

వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుపై విచారణను శాసనమండలి ఛైర్మన్ ముగించారు. రెండుసార్లు నోటీసులు ఇచ్చినా గైర్హాజరు కావడంతో విప్ పాలవలస విక్రాంత్ సమర్పించిన ఆధారాలను పూర్తిస్థాయి సాక్ష్యాలుగా పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. రఘురాజు ఎమ్మెల్సీ రద్దుపై తీర్పును వాయిదా వేశారు. త్వరలోనే వెలువరించే అవకాశం ఉంది.

క్లుప్తంగా

మహిళపై హోంగార్డ్ లైంగికదాడి

● బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

విజయనగరం క్రైమ్: బైక్‌పై వెళ్తున్న ఓ జంటను పోలీస్ వాహనంలో తన స్నేహితుడితో కలిసి వచ్చిన ఓ హోంగార్డ్ అడ్డగించి, బెదిరించి మహిళను తుప్పల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు దిశ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి కుమిలి వెళ్లే రహదారిలో బైక్‌పై తన కుటుంబసభ్యుడితో కలిసి వెళ్తున్న సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన మహిళను చూసిన హోంగార్డ్, అతని స్నేహితుడు పోలీస్ వాహనంపై వాని వెనుక వెళ్లి కుమిలి వెళ్లే రహదారిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతం వద్ద బైక్‌ను ఆపారు. అనంతరం బైక్‌పై ఉన్న వ్యక్తిని హోంగార్డ్ బెదిరించి, అక్కడే తన స్నేహితుడిని ఉంచి, మహిళను సమీప పొదల్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదుతో దిశ పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే లైంగిక దాడికి పాల్పడిన హోంగార్డ్ ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని దిశ సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

అత్యుత్తమ సేవలతో గుర్తింపు

పార్వతీపురం: విధి నిర్వహణలో చేసిన అత్యుత్తమ సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ డాక్టర్ కృష్ణాజీ అన్నారు. ఈ మేరకు గృహనిర్మాణ సంస్థ డీఈఈ ఆర్‌వీ ప్రసాద్‌బాబు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని ప్రసాద్‌బాబు దంపతులకు దుశ్శాలువతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంటుందన్నారు. శేష జీవితం ఆనందంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావుతో పాటు సిబ్బంది పాల్గొని ప్రసాద్ బాబు, జయ దంపతులను సత్కరించారు.


జూన్ 6న గిరిమిత్ర హాల్‌లో కౌన్సెలింగ్

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 6వ తేదీన కౌన్సెలింగ్ జరగనుంది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆరోజు ఉదయం 10 గంటలకు ఐటీడీఏ గిరిమిత్ర మీటింగ్ హాల్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 25లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూ.గురుకులం. ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని ప్రకటనలో స్పష్టం చేశారు.

జేసీబీ డ్రైవర్‌పై కేసునమోదు

సంతకవిటి: మండల పరిధిలోని గొల్లవలస గ్రామంలో జేసీబీ డ్రైవర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. జేసీబీతో డ్రైవర్ శంకర్ గురువారం గ్రామంలో నేలను చదును చేస్తుండగా అడ్డుగా ఉన్నాయని జీడి చెట్టు కొమ్మలను తొలగించడంతో కొమ్మలు పడి చింతాడ శివ, చింతాడ ప్రవీణ్(10), యజ్జల గౌతమ్‌లకు గాయాలయ్యాయి. దీంతో వారు రాజాంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో చింతాడ శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ వివరించారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి


మృతిచెందిన కూర్మినాయుడు

మక్కువ: మండలంలోని చెముడు గ్రామానికి చెందిన కరణం కూర్మినాయుడు (67) శుక్రవారం వడదెబ్బకు గురై మృతిచెందాడు. కూర్మినాయుడు తెల్ల వారు జామున గ్రామం సమీపంలోని తమ పొలానికి వెళ్లి, పొలం పనులు చేస్తుండగా, ఎండకు తాళలేక అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటంబసభ్యులు ఇంటికి తీసుకువచ్చి సపర్యలు చేసినప్పటికీ మృతిచెందాడు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు.

గాయపడిన మహిళ..


మృతి చెందిన అనిత (ఫైల్)

సీతంపేట: వంబరెల్లి లోయలో ఇటీవల ఆటోబోల్తా పడి తీవ్రంగా గాయపడిన గిరిజన మహిళ సవర అనిత శుక్రవారం విశాఖపట్నం కేజీహెచ్‌లో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అనిత మృతి వార్త విన్న భర్త చంద్రమోహన్, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

బిట్‌కాయిన్ కోసం జంట హత్యలు

● ఆంధ్రాలో ఒడిశా దంపతులపై దారుణం
● కేసును ఛేదించిన పోలీసులు
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణారావు


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణారావు, ఎస్సైలు, వెనుకన నిందితుడు

పాలకొండ: ఏజెన్సీ ప్రాంతంలో బిట్‌కాయిన్ మోసాలు హత్యల వరకు దారితీశాయి. ఇంతవరకు నగదు వరకే సాగిన ఈ వ్యాపారం ప్రస్తుతం రెండు హత్యలతో సంచలనంగా మారింది. ఈ వ్యాపారంలో ఒడిశాకు చెందిన భార్యాభర్తలు హత్యకు గురికాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ నెల 17న సీతంపేట మండలం పులిపుట్టి పంచాయతీ పరిధిలోని ఎర్ర చెరువులో దొరికిన గుర్తు తెలియని మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు ఆ కేసు గురించి డీఎస్పీ కృష్ణారావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17న సీతంపేట మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధి ఎర్రచెరువులో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు గ్రామ వీఆర్‌ఓ చేసిన ఫిర్యాదు మేరకు సీతంపేట ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 42 సంవత్సరాల వయస్సుగల మహిళ మెడపై లోతుగా గాయంతో పాటు వీపుపై నాలుగు చోట్ల కత్తిపోట్లు గుర్తించి హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం పాలకొండ సీఐ చంద్రమౌళి నియమితులయ్యారు. కేసు దర్యాప్తులో భాగంగా హతురాలిని గుర్తించేందుకు తొలుత ప్రయత్నించారు. పోలీసులు ప్రచురించిన ఫొటోను చూసిన బంధువులు హతురాలిని ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా, గుమ్మ సమితి, జమ్మి పంచాయతీ, అర్ధంగూడ గ్రామానికి చెందిన రూట్ భుయాన్‌గా గుర్తించి సమాచారం ఇచ్చారు. కేసు పరిశోధనలో భాగంగా హతురాలి భర్త మిఖైల్ భుయాన్ కోసం పోలీసులు ప్రయత్నించగా ఆచూకీ లభించలేదు. మూడు రోజుల పాటు ఆయన సెల్ ఫోన్ కూడా స్విచాఫ్ చేసి ఉండడంతో భర్తే హత్య చేసి ఉంటాడన్న అనుమానంతో ఫోన్ ట్రాప్‌లో పెట్టారు. మూడు రోజుల అనంతరం ఆ ఫోన్ ఐఎంఈ నంబర్ ఆధారంగా ఇంకో నంబర్ వాడుతున్నట్లు గుర్తించి నంబర్ ఆధారంగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు.


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు, (ఇన్‌సెట్లో)హత్యకు కారణమైన బిట్‌కాయిన్

ఒకరి తర్వాత మరొకరి హత్య

మిఖైల్ భుయాన్ గ్రామంలో తాపీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఇటీవల అతనికి ఒడిశా రాష్ట్రంలోని కాశీనగర్ బ్లాక్ కడశింగి గ్రామానికి చెందిన మరో తాపీ మేస్త్రీ జోసఫ్ భుయాన్‌తో పరిచయం ఏర్పడింది. ఈ సందర్భంగా తన దగ్గర బిట్ కాయిన్ ఉందని దానిని అమ్మి పెట్టాలని మిఖైల్ భుయాన్‌ను జోసఫ్ భుయాన్ కోరాడు. దీంతో ఆ కాయిన్ తానే కొంటానని చెప్పిన మిఖైల్ భుయాన్ లక్ష రూపాయలకు బేరం కుదుర్చుకున్నాడు. ఆ డబ్బులు పట్టుకుని భార్య రూట్ భుయాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జోసఫ్ భుయాన్ ఇంటికి వెళ్లాడు. అక్కడ వారు మాట్లాడుకున్న అనంతరం కాయిన్ మరో దగ్గర ఉంది తీసువద్దామని జోసఫ్ భుయాన్ చెప్పడంతో మిఖైల్ భుయాన్ భార్యను అక్కడే ఉండమని చెప్పి జోసెఫ్‌తో కలిసి బైక్‌పై వెళ్లాడు. ఒడిశా సరిహద్దు పొలాల్లోకి జోసెఫ్ తీసుకువెళ్లి అక్కడ మిఖైల్ భుయాన్‌ను ముందుగా సిద్ధం చేసుకున్న ఆయుధాలతో హత్య చేశాడు. అనంతరం మృతదేహన్ని కాల్చివేసి మిఖైల్ దగ్గర ఉన్న లక్షరూపాయలు తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. ఇంటిదగ్గర వేచి ఉన్న మిఖైల్ భార్య భుయాన్‌కు నీ భర్త కాయిన్ తీసుకుని అక్కడ ఉన్నాడు. నిన్ను తీసుకురమ్మన్నాడని నమ్మించి తన బైక్‌పై ఎక్కించి సీతంపేట మండలంలోని పుల్లిపుట్టి వద్ద ఎర్రచెరువు వద్దకు తీసుకువెళ్లి హత్య చేశాడు. మృతదేహన్ని అక్కడే పడేసి ఇంటికి వెళ్లిపోయాడు. హతుడు మిఖైల్ సెల్‌ఫోన్‌లోని సిమ్ తీసి కొత్త సిమ్ వేసి జోసెఫ్ వాడుకోవడంతో పోలీసులకు చిక్కాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బిట్ కాయిన్‌తో పాటు, లక్షరూపాయల నగదు, హత్యకు ఉపయోగించిన కత్తి, ఇతర ఆయుధాలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ చంద్రమౌళి, సీతంపేట ఎస్సై జగదీష్‌నాయుడు, పాలకొండ ఎస్సై ప్రశాంత్‌కుమార్‌లను జిల్లా పోలీసు అధికారులు అభినందించారు. కేసు దర్యాప్తులో పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరును డీఎస్పీ కృష్ణారావు అభినందించారు.

అసంపూర్ణంగా ముగిసిన జిందాల్ కార్మికుల చర్చలు

● కొనసాగుతున్న ఆందోళన


డీసీఎల్ సమక్షంలో చర్చలు జరుపుతున్న కర్మాగార యాజమాన్యం ప్రతినిధులు, కార్మిక సంఘాల జేఏసీ నాయుకులు నెక్కల నాయుడుబాబు తదితరులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామం సమీపంలో గల జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగారం కార్మికులు, యాజమాన్యం మధ్య విజయనగరం జిల్లా కేంద్రంలో గల డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన చర్చలు అసంపూర్ణంగా ముగిశాయి. ఈ చర్చల్లో కార్మిక సంఘాల జేఏసీ సభ్యులు నెక్కల నాయుడుబాబు, పిల్లా అప్పలరాజు, గాడినమ్మి చిన్నబాబు, పప్పల బంగారునాయుడు, భీమయ్యలు, కర్మాగారం యాజమాన్య ప్రతినిధులు దినేష్‌శర్మ, గోపాలకృష్ణ, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ముడిసరుకు సమస్య కారణంగా గడిచిన 15 రోజుల క్రితం కర్మాగారం లేఆఫ్ ప్రకటించి మూసేసిన విషయం తెలిసిందే. నాటి నుంచి కర్మాగారం ఎదుట కార్మికులు ఆందోళన చేస్తున్నారు. కర్మాగారాన్ని తక్షణమే తెరవాలని, కాంట్రాక్ట్ కార్మికులకు లే ఆఫ్‌ను వర్తింప చేయాలని, అవసరమైతే 20 రోజుల వేతనానికే పని చేస్తామని, లేదంటే మరో యూనిట్‌కు తరలిస్తే అక్కడ ప్రస్తుతం ఇస్తున్న వేతనానికి రెట్టింపు వేతనవం ఇవ్వాలని, భోజనం,వసతి సౌకర్యాలు కల్పించాలని కార్మిక సంఘాల నాయుకులు ఇప్పటికే డీసీఎల్ సమక్షంలో కోరారు. కాగా శాశ్వత కార్మికులు 57 మందికి మాత్రమే లే ఆఫ్‌ను వర్తింపచేస్తామని, కాంట్రాక్ట్ కార్మికులైన 264 మందికి వర్తింప చేయలేమని కర్మాగారం యాజమాన్య ప్రతినిధులు స్పష్టం చేశారు. అలాగే జాజ్‌పూర్‌లో గల మరో యూనిట్‌కు కార్మికులను తరలిస్తామని అక్కడ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనానికి అదనంగా రూ.4500 ఇస్తామని యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. దీనికి కార్మికులు సమ్మతం తెలపలేదు. మరో రెండు మూడు రోజుల్లో యాజమాన్యం అభిప్రాయాలన్నీ స్పష్టంగా తెలియ పర్చాలని డీసీఎల్ సుబ్రహ్మణ్యం సూచించారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులంలో మిగులు సీట్ల భర్తీ


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జిల్లా సమన్వయకర్త పద్మజ

నెల్లిమర్ల: జిల్లాలోని అంబేడ్కర్ గురుకులం బాలికల కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ మిగులు సీట్లు భర్తీ చేసినట్లు ప్రిన్సిపాల్ కె.ఉషారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నెల్లిమర్లలోని అంబేడ్కర్ గురుకులం బాలికల కళాశాలలో ఉమ్మడి జిల్లాలోని డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీ గురుకులాల జిల్లా సమన్వయ కర్త టి.పద్మజ ఆధ్వర్యంలో జరిగిందని తెలిపారు. మొత్తం ఖాళీలు 134 ఉండగా కౌన్సెలింగ్‌లో ఎస్సీ–62, ఎస్టీ–7, బీసీ–17, ఓసీ–1, మొత్తం 87 సీట్లను భర్తీ చేశామన్నారు. కౌన్సెలింగ్‌లో నెల్లిమర్ల, చీపురుపల్లి, వియ్యం పేట, వేపాడ, గరుగుబిల్లి, కొమరాడ హెచ్‌ఎంలు టి.ఎం.ఫ్లోరెన్స్, టి. జయశ్రీ, ఎ.రాణిశ్రీ, ఎల్.పద్మావతి, టి.రామదాసు, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

విమానాశ్రయ సిబ్బంది క్వార్టర్స్ భూసర్వేలో ఉద్రిక్తత


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

భోగాపురం: భోగాపురంలో ప్రభుత్వం చేపట్టిన అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనుల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న విమానాశ్రయ సిబ్బందికి క్వార్టర్స్ నిర్మాణానికి బసవపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 25లో ఉన్న 21 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్, మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, వీఆర్వో కాళి సిబ్బందితో కలిసి శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న బసవపాలెం గ్రామస్తులు భూముల వద్దకు వెళ్లి సర్వే ఆపాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. మాతాత తల్లిదండ్రుల దగ్గర నుంచి కొన్నేళ్లుగా ఈ భూముల్లో జీడి, కొబ్బరి తోటలు వేసుకుని కుటుంబాలతో కలిసి వాటిపైనే ఆధారపడి జీవిస్తున్నామని, ఇప్పడు వాటిని తొలగిస్తే మా పరిస్థితి ఏం కావాలంటూ అధికారులను ప్రశ్నించారు. దీనికి అధికారులు స్పందిస్తూ భూసర్వే ఆపడం మా చేతుల్లో లేదని, ప్రభుత్వానికి సబంధించిన భూముల్లో మాత్రమే సర్వే చేస్తున్నామన్నారు. ఈ భూములకు సంబంధించి మీ దగ్గర ఏమైనా ఆధారాలుంటే తహసీల్దార్‌ను గాని, కలెక్టర్‌ను గానీ సంప్రదించాలని రైతులకు సూచించారు. దీంతో రైతులు అక్కడినుంచి వెనుదిరిగారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

● హిందూ ధర్మ రక్ష సమితి రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్


హనుమాన్ శోభయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హిందూ ధర్మ రక్ష సమితి ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో శనివారం భారీ హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నామని సమితి రాష్ట్ర కార్యదర్శి నందివాడ వేణుగోపాల్, అధ్యక్షుడు అబోతుల శ్యాంసుందర్‌లు ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు స్థానిక ప్రైవేట్ కల్యాణమంటపంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి శఠగోపం పార్థసారథితో కలిసి వారు మాట్లాడారు. కొత్తపేటలో గల కొత్తకోవెల నుంచి హనుమాన్ విగ్రహాలతో కార్యక్రమం ప్రారంభమై సాయంత్రం కోట నుంచి మూడు లాంతర్లు జంక్షన్, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి కోవెల, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ మీదుగా తిరిగి కోట జంక్షన్‌కు శోభాయాత్ర చేరుకుంటుందని తెలిపారు. అంగరంగ వైభవంగా జరిగే ఈ హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ సహిత సీతారాముల వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. సమావేశంలో సమితి ప్రతినిధులు రామ్, తరుణ్ నాయుడు, అరవింద్, ఉదయ్, లోకేష్, సంతోష్, వెంకట్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళకు తీవ్రగాయాలు


రైలు నుంచి జారిపడి గాయపడిన కృష్ణవేణి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబర్ 2లో రైలు నుంచి జారిపడిన ఓ మహిళ జారిపడి శుక్రవారం తీవ్ర గాయాలపాలైంది. దీనిపై జీఆర్‌పీ ఇన్‌చార్జి రత్నాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ మండలంలోని డి.శిర్లాం గ్రామానికి చెందిన సిరికి కృష్ణవేణి పార్వతీపురం నుంచి గోపాలపట్నం వెళ్లేందుకు కదులుతున్న సమతా ఎక్స్‌ప్రెస్ ఎక్కుతుండగా కాలు జారి ఫ్లాట్‌ఫాంపై పడి తీవ్రగాయాల పాలయ్యింది. తక్షణమే ఆమెను చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు జీఆర్‌పీ ఇన్‌చార్జ్ రత్నాకర్ తెలిపారు.

గాబువానిపేటలో చోరీ

భోగాపురం: మండలంలోని గాబువానిపేటలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నక్క రాంబాబు, భార్య రమ గురువారం రాత్రి ఇంటి మేడపై నిద్రిస్తున్న సయమంలో సుమారు అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో దొంగలు వచ్చి వారి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు అభరణాలతో పాటు రూ.10 వేలు నగదును దొంగలించుకుపోయారు. శుక్రవారం ఉదయం భార్యాభర్తలు ఇంట్లో చూసేసరికి చిందరవందరగా పడి ఉన్న సామాన్లతో పాటు బీరువాలో దాచుకున్న బంగారు అభణాలు, నగదు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ ఎ.రవికుమార్ తెలిపారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి

● సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు



ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు హితవు పలికారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం సర్వజన ఆస్పత్రిలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైనీ, గుట్కా, పాన్ పరాగ్‌వంటి వాటి వినియోగం వల్ల కేన్సర్ వచ్చే ఆస్కారం ఉందన్నారు. అదేవిధంగా చుట్ట, సిగరెట్ తాగడం వల్ల కేన్సర్ సోకే ప్రమాదం ఉందని చెప్పారు. మత్తు పదార్థాల వినియోగానాకి స్వస్తి పలకడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు. సిగరెట్, పొగాకు జీవితాలను నాశనం చేస్తుందని, పొగాకు ఉత్పత్తులు తినడం, తాగడం వల్ల ఏటా ఎంతో మంది నోటి కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, సీఓపీడీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. ఆరోగ్యకర సమాజం కోసం పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ ఎస్. సురేష్‌బాబు, డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ మణికుమార్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ అదిత్య వర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకుల మృతి

● మితిమీరిన వేగంతో ప్రాణనష్టం
● కాంపౌండ్ వాల్ ఢీకొట్టడంతో ప్రమాదం


సంఘటనాస్థలంలో చెల్లాచెదురుగా పడిన కిశోర్, హేమంత్‌లు


విజయనగరం క్రైమ్: ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో విజయనగరంలోని రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మితిమీరిన వేగంతో బైక్ నడిపిన ఇద్దరు యువకులు అదుపుతప్పి కాంపౌండ్ వాల్‌ను ఢీకొని ప్రాణాల మీదికి తెచ్చుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని లంకాపట్నానికి చెందిన పాడుగు కిశోర్ (19), పాడుగు హేమంత్(18)లు చిన్నాన్న, పెద్దనాన్న పిల్లలు. కోటవద్ద పండ్ల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న వారి అమ్మమ్మకు ఇంటి నుంచి భోజనం తీసుకువచ్చారు. అమ్మమ్మకు భోజనం ఇచ్చి బిర్యానీ తిందామని హోటల్‌కు బయల్దేరిన ఇద్దరు యువకులు మితిమీరిన వేగంతో బైక్ నడిపి, రామానాయుడు రోడ్డు మలుపులో ఫుట్‌పాత్ పైనుంచి ఓ ఇంటి కాంపౌండ్‌వాల్‌ను బలంగా ఢీకొట్టారు. దీంతో జరిగిన ప్రమాదంలో రోడ్డుపై ఇద్దరూ పడిపోగా కిశోర్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు వెంటనే స్పందించి 108 సాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి హేమంత్‌ను తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై నవీన్ పడాల్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్‌బంకు వద్ద వ్యక్తి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస పెట్రోల్ బంకులో పనిచేస్తున్న మండల పరిధిలోని వీఆర్‌అగ్రహారం గ్రామానికి చెందిన బంగారు రామచంద్రరావు (54) శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామచంద్రరావు బహిర్భూమికి వెళ్లి వస్తుండగా పెట్రోల్ బంకు వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే గమనించి సిబ్బంది సపర్యలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వెంటనే బంకు యాజమాన్యం పోలీసులకు, మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మృతుని కుటుంబసభ్యులు భోరున విలపించారు. ఈ ఘటనకు సంబంధించి మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జోరుగా ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్


పార్వతీపురం మండలం పెద్దబొండపల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు మూడు రోజులుగా యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య డ్రైవ్‌ను గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల లో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీ (ఏఎల్ఓ) కార్యకలాపాలు, తుప్పల తొలగింపుతో సహా బావులు, కొళాయిలు, బోరుల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. కీటకాల నివారణకు బ్లీచింగ్ చల్లారు. మలేరియా దోమల వ్యాప్తి నివారణకు స్ప్రేయింగ్ కార్యక్రమాలను వేగవంతం చేశారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా మలేరియా అధికారి సమన్వయంతో పనిచేస్తూ సంబంధిత సిబ్బందితో క్షేత్రస్థాయిలో పలు కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు దోమల నివారణ ఆవశ్యమని, అందుకు ఎక్కడా నీరు నిలువ ఉండకుండా ప్రతి ఇంటిలో చర్యలు చేపట్టాలని కోరారు. ఇళ్ల వద్ద, గ్రామాల్లో ఖాళీ కొబ్బరి బొండాలు, నీటి సీసాలు, టైర్లు, తొట్టెలు వంటి సామగ్రి లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దోమల వ్యాప్తి నివారణకు స్ప్రేయింగ్‌ను ఇంటా, బయటా తప్పనిసరిగా చేయించాలని చెప్పారు. దోమ తెరలు వినియోగించాలని కోరారు.

నీటిని కాచి చల్లార్చి తాగాలి

జిల్లాలో ఇకపై వర్షాలు కురిసే అవకాశం ఉండడం తెలిసిందేనని, నీరు కలుషితమయ్యే అవకాశాలు ఉంటాయని పేర్కొంటూ నీటిని మరిగించి కాచి, చల్లార్చి తాగాలని సూచించారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా 302 గ్రామ పంచాయతీల పరిధిలో లార్వా నివారణ చర్యలు చేపట్టగా 1505 అవాసాలలో పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. 1.27 లక్షల గృహాల పరిధిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం, అవగాహన కల్పించడం పూర్తయింది. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్ మోహనరావు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సమన్వయం, పర్యవేక్షణ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ, మలేరియా సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.